# పాపం పూర్ ఫెలో

'గురా' అగ మేఘాలమీద పరుగెత్తు కొంటూ వచ్చిన ఆంజనేయులు దఢేలున గుమ్మంమీద పడిపోయాడు. ఆ పడటంలో గుమ్మం అవతల ఓకాలు, ఇవతల ఓకాలు పడి నొప్పి పుడుతున్నా లెక్కచేయకుండా కంగారుగా ఆయాసంతో ఏదో చెప్పబోయాడు.

"అబ్బ ఏమిట్రా ఆ కంగారు ఏదో కొంపలంటుకు పోయినట్టు కాస్త నిదానంగా ఏడ్వరాదా" విసుక్కొన్నాడు రామం.

"ఆ నిదానంగా ఏడిస్తే అంతకన్నా మించినదే జరిగిపోతుంది" ఆంజనేయుల్ని ఇంకా రొప్పు వదల్లేదు.

"ఇంతకీ ఏమయ్యిందో అసలు సంగతి త్వరగా ఏడ్వరా"

"మరే మరే" ఆంజనేయులు లేవబోతూ కాలునొప్పి పుట్టటంతో 'అబ్బా' అని మూల్గాడు.

"ఏమిటో సస్పెన్స్‌తో చంపక తొందరగా చెప్పరా పక్షీ"

"మరే సితారా అబ్బా" అని అన్నాడు.

"ఊఁ సితార కేమయ్యింది" ఆంజనేయుని భుజాలు పట్టుకొని ఊపేశాడు రామం.

"అబ్బ సితారకేం కాలేదుకాని నా భుజాలు వదల్రా బాబు అసలే కాళ్ళు నొప్పి పుట్టి ఛస్తున్నాను. మళ్ళీ భుజాలుకూడా... ఎక్కడ చావను."

"మరి ఏవిట్రా సితార అన్నావు"

"కంగారేమి లేదు. సితార ఇప్పుడే కనకదుర్గ గుడికి వెళ్ళింది" చెప్పాడు ఆంజనేయులు రొప్పుతూ.

"ఎంత తియ్యటి వార్త చెప్పావురా" గబగబా సీసాలన్నీ వెదికి పంచదారతెచ్చి ఆంజనేయులి నోట్లో పోశాడు రామం.

"ఒరేయ్ ఈ అయిదు రూపాయిలు తీసుకొని ఏదయినా నూన్‌షోకి వెళ్ళరా" డబ్బులు ఆంజనేయులికి అందించాడు

గబగబా బట్టలు మార్చుకొని నీట్‌గా తయారయ్యి అయిదు నిమిషాల్లో బస్టాపు కొచ్చాడు తాను వెళ్ళవలసిన రూట్ బస్సు పావుగంటయినా ఒక్కటి రాలేదు. ఛీఛీ వెధవ బస్సులు వస్తే ఒక దాని వెంట ఒకటి రావడం లేకపోతే అసలు ఎడ్రస్ ఉండవు. మనస్సులోనే విసుక్కున్నాడు రామం.

మరో అయిదు నిముషాలకి గాలి వెళ్ళటానికి కూడా వీల్లేనంత రష్‌గా ఉన్న బస్సు దుమ్ము రేపుకొంటూ వచ్చి ఆగింది. అంగుళం ఖాళీ లేదనిపించినా సితారగుర్తొచ్చి వెంటనే ఎక్కేసాడు.

శ్రావణ శుక్రవారం అవటంవలన దుర్గ గుడివైపు వెళ్ళే బస్సులన్నీ అలానే ఉన్నాయి. బస్సు ప్రతి స్టేజిలోను ఆగుతుంటే ఎక్కడలేని విసుగొచ్చిందిరామంకి.

బస్సు దిగిన దగ్గరనుండి సితారని వెయ్యి కళ్ళతో వెతుకుతూ పైకి వెళ్ళాడు. పైనకూడా ఇంచు అంతా వెతికాడు ఎక్కడా సితార కన్పించలేదు. భక్తులలైన్ చూస్తుంటే కొండవీటి చాంతాడంత ఉంది.

వెధవ తన బలహీనత కనిపెట్టి డబ్బులు కోసం వేసుంటాడు ప్లాన్ మనస్సులోనే తిట్టుకున్నాడు ఆంజనేయుల్ని. ఆఖరి ప్రయత్నంగా అంతా గాలిస్తుండగా లైన్ చివర ఎక్కడో కనిపించింది సితార. రామం ముఖం వెయ్యికాండిల్ బల్బులా వెల్గిపోయింది. గబగబా వెళ్ళబోయిన వాడు ఆగి ఆమెకోసమే వెళ్ళినట్లుగా కాకుండా నిదానంగా తల వొంచుకొని నడుస్తూ అనుకోకుండా ఆమెని చూసినట్టుచూసి చిన్నగా స్మయిల్ చేశాడు. ప్రతిగా ఆమెకూడా తప్పదు అనుకొన్నట్లుగా నవ్వింది.

"ఇంతమంది ఉన్నారు ఈ వేళ్టకి దర్శనం అవుతుందనేనా మీ ఉద్దేశం" నవ్వుతూ యధాలాపంగా అన్నట్టుగా అన్నాడు ఓ ప్రక్క ఆనందపడుతూనే.

"అమ్మాయ్ సీతా వీడినోసారి ఎత్తుకోవే నాచెయ్యి పీకుతోంది" సితార వెనుక ఉన్న బామ్మగారు పిల్లాడిని సితారకందించి" సువ్వెవరవు అన్నట్టు చూసింది రామాన్ని.

నవ్వుతూ ఇంతేదో అనబోయిన రామం తఫీమని ఆపేశాడు. వెనుక ఈ బామ్మ



# మినీ కథ

మేళం కూడా ఉందని నీరుకారిపోయాడు. కాని అంతలోనే మంచి ఐడియా తట్టింది.

"ఇంతమంది జనంలో మీరేం నెగ్గగల్గుతారు బామ్మగారు ఉండండి ఇక్కడ నాకు తెల్సినవారున్నారు. వాళ్ళనడిగి మనం

త్వరగా వెళ్ళే ఏర్పాటుచేస్తాను'అన్నాడు. "బాబ్బాబు అదేదో కాస్త తొందరగాచేసి పుణ్యంకట్టుకో నాయనా కాళ్ళు పీకుతున్నాయి,నిలబడలేను"అని బామ్మగారనేసరికి బ్రహ్మానంద పడిపోయిన రామం సితారకొక చిర్నవ్వు పారేసి "బాబుని మీరేం ఎత్తుకుంటారు ఇటివ్వండి" అని పిల్లాడిని తీసుకొని బగగబా వెళ్ళాడు.

నిజానికి అతనికి తెల్సినవారెవరులేరు డబ్బులు ఖర్చు అవుతున్నాయని బాధగా ఉన్నా సితారకొరకు ఆమె ప్రేమపొందటం కొరకు ఆమాత్రం ఖర్చుపెట్టక తప్పదని దగ్గరేఉన్న ఓ కానిస్టేబుల్‌కి అయిదు రూపాయలు సమర్పించుకొని వచ్చాడు. "రండి బామ్మగారు అయిదు నిముషాల్లో దర్శనం చేసుకొని వెళ్ళిపోవచ్చు" ముందు బామ్మగార్ని మంచిచేసుకొని తరువాత సితారని మాటల్లోకి దించాలనుకొన్నాడు. "అయ్యో నామతి మండ పైన తీసుకో వచ్చులే అని క్రింద కొబ్బరికాయలు కొనలేదు. పైకి వచ్చిన తరువాత ఈలైను చూసి గుండెదడవచ్చి మర్చిపోయాను. బాబ్బాబు రెండు కొబ్బరికాయలు కూడా తెచ్చిపెట్టు నాయనా" డబ్బు లివ్వబోయింది బామ్మగారు. "అబ్బెబ్బె వద్దు ఉంచండి మనలో మనకేమిటి ఇక్కడే మావాళ్ళదొక కొబ్బరికాయల కొట్టు ఉంది వెళ్ళి చిటికెలో తెస్తాను."

"ఏంటి బాబు ఏడుస్తున్నావు" కొబ్బరికాయలు బామ్మగారికిస్తూ సితార చంకలో ఉన్నవాడిని పలుకరించాడు దాంతో వాడి ఏడుపు తారాస్థాయి నందుకొంది.

"వీడికి ఆకలేస్తుందట. ఇందాకటినుంచి ఒకటే ఏడుపు ఓ బిస్కట్ల ప్యాకెట్టు తెచ్చిపెట్టు బాబు" డబ్బులు తీయబోయింది.

సితేం అక్కరలేదా మనసులోనే తిట్టేసుకొన్నాడు ఏడుస్తున్నవాడిని తీసుకొని డబ్బులొద్దని వెళ్ళిపోయాడు. డబ్బు ఎంతయినా ఫరవాలేదు సితార దృష్టిలో హీరోగా వెలగాలి.

క్రిందికి దిగిన తరువాత నాలుగు అడుగులు వేసిందో లేదో" ఇంత "నేను నడువలేను సితా కాళ్ళు పీకుతున్నాయి. అంతకన్నా నోరు ఎండిపోతోంది" అక్కడే కూలబడింది బామ్మగారు.

ఓసి నిన్ను తగలెయ్య మండిపోయింది రామంకి కాని నిండామునిగినవాడికి చలేమిటి.

"సితారా కాస్త దాహం తీర్చుకొందాం ఆగండి, పదండి బామ్మగారు అషాప్ దగ్గరకి" ఈసారి గోల్డ్‌స్పాట్ దెబ్బకి తొమ్మిది రూపాయిలు వదిలాయి. డబ్బు గురించి మనస్సులో ముల్లులా గుచ్చుకొంటున్నా ప్రక్కనే ఉన్న సితారనిచూసి ఆనందపడిపోయాడు. మళ్ళీ పిల్లాడు బిస్కట్లుప్యాకెట్టు కావాలని అనన్నాక్కరాగం ఆలపించాడు తప్పదనుకొని చిన్నది ఇప్పిస్తుంటే- కాదు పెద్దది కావాలని పేచి పెట్టాడు మరొక అయిదు సమర్పించుకొన్నాడు దానికి.

"అమ్మాయి దాహం తీరిందిగాని అడుగు మాత్రం పడటంలేదే" బామ్మగారు నిలబడిన చోటునుండి ముందుకి కదలలేదు.

"నిన్ను తగలెయ్య"మనస్సులోనే తిట్టుకొంటూ ఆటోకోసం వెళ్ళాడు రామం.

"రామం అని మాకాలేజివాడే"

"చాలా బుద్ధిమంతుడిలా ఉన్నాడే"

వాడిటొంద. పక్కా రోడ్‌సైడ్ రోమియో. సినిమాకి, షికార్‌కి, గుడికి ఎక్కడికెళ్ళినా వెనుకే తయారవుతాడు బాడీగార్డులా, వాడికిరకంగా బుద్ధిచెపితే ఇంకొకసారి బాడీగార్డుపని చెయ్యడు."

ఆటో వచ్చింది. ముందు బామ్మగారు ఎక్కి పిల్లాడిని తీసుకొన్న తరువాత సితారకూడా ఎక్కింది

"థేంక్స్ రామంగారు మాకోసం చాలా శ్రమపడ్డారు" ఓచిరునవ్వు పారేసింది సితార ఆటోలొంచే.

తబ్బిబ్బయిపోయిన రామం "అబ్బెబ్బె ఇంతమాత్రాని కేముందండి"అన్నమాటలు స్టార్ట్ అయిన ఆటో శబ్దంలో కల్సిపోయాయి.

నీరసంగా నిలబడ్డ రామానికి ఖాళీ జేబులు వెక్కిరించాయి. తండ్రి నిన్ననే ముప్ఫైవేల జాగ్రత్తలతో పంపిన ముప్ఫై రూపాయిలు ముప్ఫైగంటలయినా గడవకముందే సిటీబస్ ఛార్జీకయినా మిగలకుండా ఖర్చు అయిపోవటంతో రెండు కాళ్ళకి బుద్ధి చెప్పాడు పాపం పూర్‌ఫెలో.

-టి. సుహాసిని
ఇం.నెం. ఎఫ్/58, లబ్బిపేట,
విజయవాడ-10

## పద్దెపల్లి పదాలు

ఎటు చూసిన 'దేశం'లో
పెరిగె ఎన్నికల సందడి!
ఎటకేగిన రాష్ట్రంలో
ఎదిగె నీటి ఎద్దడి!

•

ఓటుకు తగినంత డబ్బు
ఓటరడిగె ఒకనాడు!
'వాటరే' కావాలని ప్రతి
ఓటరడుగు ఈనాడు!

•

ఆంధ్రులు స్నానాలు లేక
అరబ్బులై పోతున్నా
ప్రాణం నిలిపే జల-
పానం జరిగిన చాలు!

•

